క్లుప్తంగా

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిపేట పల్లె దవాఖానాలో సోమవారం అగ్నిప్రమాదాల నివారణపై అగ్ని మాపకశాఖ అధికారులు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు,సిలిండర్ వినియోగించే వి.దానం గురించి వైద్య సిబ్బందికి వివరించారు. అగ్నిమాపకశాఖ అధికారులు వినోద్, సిబ్బంది, వైద్య సిబ్బంది శివకృష్ణ, స్వరూప ఉన్నారు.

రుణ వసూళ్లకు స్పెషల్ డ్రైవ్



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం స్త్రీశక్తి రుణాల బకాయిల వసూళ్ల కోసం గ్రామసంఘాల ప్రతినిధులతోపాటు వీవోఏలు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. రుణాలు చెల్లించకపోవడం వల్ల కలిగే నష్టం గురించి వారు మహిళా సంఘాల సభ్యులకు వివరించారు. ఐకేపీ ఏపీఎం రాంనారాయణగౌడ్ తదితరులు ఉన్నారు.

పంటపొలాల పరిశీలన



బాన్సువాడ రూరల్: మండలంలోని సంగోజీపేట్ గ్రామంలో సోమవారం ఏఈవో జ్ఞానేశ్వర్ రైతులతో కలిసి పంటపొలాలను పరిశీలించారు. అనంతరం ఏఈవో మాట్లాడుతూ.. వరిలో మురుగునీరు నిల్వ ఉండకుండా రైతులు జాగ్రత్త పడాలన్నారు. ప్రస్తుతం వరి పైరుకు ఉల్లికోడు తెగులు ఆశిస్తున్నాయన్నారు. నివారణకు ఎకరాకు 4కిలోల 0.6 జి ఫిప్రోనిల్ గుళికలను 20కేజీల ఇసుకలో కలిపి చల్లుకోవాలన్నారు. కాండం తొలుచు పురుగు గమనించినట్లయితే ఎకరాకు 4కిలోల క్లోరాంట్రానిపోల్ 0.4 జి గుళికలు చల్లుకోవాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



దోమకొండ: మండలంలోని ముత్యంపేట్ జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం 2002–03 బ్యాచ్‌కు చెందిన ఎస్సెస్సీ విద్యార్థులు 'పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం' కార్యక్రమం నిర్వహించారు. 23 ఏళ్ల తర్వాత మళ్లీ వారంత ఒక్కచోటికి చేరడంపై హర్షం వ్యక్తం చేశారు. ఒకరినొకరు పలుకరించుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. అప్పటి ఉపాధ్యాయులు విఠల్‌రెడ్డి, రమేష్ శర్మ, కృష్ణమోహన్, రాజేందర్, సిద్ధరాములు, నారాయణరెడ్డి, విష్ణువర్ధన్, ధర్మ సింగ్ పాల్గొన్నారు.

గీత కార్మికులు ఉద్యమాలకు సిద్ధం కావాలి



కామారెడ్డి అర్బన్: కల్లుగీత వృత్తి రక్షణకు గీత కార్మికులు ఉద్యమాలకు సిద్ధం కావాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌గౌడ్ పిలుపునిచ్చారు. అమరుల యాదిలో గీతన్నల సామాజిక చైతన్య యాత్రలో భాగంగా సోమవారం కామారెడ్డిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గీత కార్మికుల కోసం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కల్తీ కల్లు పేరిట గీత వృత్తికి అన్యాయం చేయవద్దన్నారు. నాయకులు బాలాగౌడ్, శేఖర్‌గౌడ్, మల్లాగౌడ్, సిద్ధాగౌడ్, అంజగౌడ్, గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన వరి పంట



భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలో ఉన్న వరి పంట చేను నీటమునిగింది. భిక్కనూరు–రామేశ్వర్‌పల్లి వెళ్లె దారిలో బైపాస్ బ్రిడ్జి వద్ద ఉన్న వంతెన మట్టితో కూడుకపోయింది. ఈక్రమంలో పంటపొలాల నుంచి వచ్చే నీరు వంతెన నుంచి పారడంలేదు. దీంతో వంతెన సమీపంలోని ధమ్మయ్యగారి సంజీవరెడ్డి, లక్ష్మారెడ్డి అనే రైతులకు చెందిన వరి పంట నీట మునిగిపోయింది. ఈవిషయమై అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు.

చిన్నారులకు ఆహారం అందించేదెలా?

- అంగన్‌వాడీ కేంద్రాలకు అందని ఆయిల్, పోపు దినుసులు
- మూడు నెలలుగా పెండింగ్‌లో గ్యాస్ బిల్లులు

ఎల్లారెడ్డిరూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో నిత్యవసర సరుకులు సరిపడ లేకపోవడంతో వంట చేసి, అందించడం ఇబ్బందిగా మారిందని అంగన్‌వాడీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో మాత్రం అది ఆచరణ కావడం లేదని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సిబ్బంది సొంత డబ్బుతో..

ఎల్లారెడ్డి సీడీపీవో ప్రాజెక్టు పరిధిలోని ఎల్లారెడ్డి, లింగంపేట, నాగిరెడ్డిపేట, గాంధారి మండలాల్లో 276 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో కొన్ని సెంటర్లలో గత రెండు నెలలుగా మంచి నూనె, పోపు సామాను, తదితర వస్తువులు సరఫరా కావడం లేదు. దీంతో అంగన్‌వాడీ సిబ్బంది తమ సొంత డబ్బులతో సామగ్రిని కొనుగోలు చేసి అంగన్‌వాడీ కేంద్రాలను నడుపుతున్నారు. వీటితోపాటు అంగన్‌వాడీ కేంద్రాలకు రావాల్సిన గ్యాస్ బిల్లులు సైతం గత మూడు నెలల నుంచి రాక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు మంచినూనెతో పాటు సరిపడ సామగ్రిని ప్రతి నెలా సకాలంలో అందించాలని ప్రజలు కోరుతున్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు విద్యాబోధన చేస్తున్న టీచర్ (ఫైల్)

తగిన చర్యలు తీసుకుంటాం

అంగన్‌వాడి కేంద్రాలకు ఆయిల్, పోపు సామగ్రి పంపిణీ జరుగుతుంది. కొన్ని కేంద్రాలకు సరఫరా కావడంలో కొంత జాప్యం ఉంది. అన్ని కేంద్రాలకు ఆయిల్ సరఫరా చేసి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– ప్రసన్న, ఏసీడీపీవో, ఎల్లారెడ్డి

అధ్వానంగా ఎల్లయ్య చెరువు



ఎల్లయ్య చెరువు వద్ద డంప్ చేసిన వ్యర్థాలు

బాన్సువాడ: పట్టణంలోని ఎల్లయ్య చెరువు అధ్వానంగా మారింది. మున్సిపల్ సిబ్బంది చెరువులోనే చెత్తను డంప్ చేసి తగలబెడుతున్నారు. దీంతో చెరువు నీరు కలుషితమవుతుంది. వ్యర్థాల కారణంగా చెరువు సమీపంలోకి రాగానే తీవ్రంగా దుర్వాసన వెదజల్లుతోందని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొయ్యగుట్ట సమీపంలోని దాలమల్ గుట్ట వద్ద డంపింగ్ యార్డు ఉన్నా.. కొన్నిసార్లు సిబ్బంది డంపింగ్ యార్డుకు వెళ్లకుండా దగ్గరగా ఉన్న ఎల్లయ్య చెరువులోనే చెత్తను డంప్ చేస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్‌ను 'సాక్షి' సంప్రదించగా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువు కలుషితం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

భగీరథ పైప్‌లైన్ లీకేజీ

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో మిషన్ భగీరథ పైపు లీకేజీ ఫౌంటెయిన్‌లా తలపిస్తోంది. పట్టణంలోని దేవునిపల్లి శివారులో గల వేబ్రిడ్జి వద్ద మిషన్ భగీరథ పైపు లీకేజీ అయింది. దీంతో నీరు విరజిమ్మడంతో అటు వైపు నుంచి వచ్చే వాహనదారులు ఇబ్బందులు పడుతుండగా, మరోవైపు జనాలు సెల్ఫీ తీసుకుంటు పోజులిస్తున్నారు. లీకేజీ కారణంగా నీరంతా వృథా అవుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఎల్లారెడ్డిలో ఫౌంటెయిన్‌లా విరజిమ్ముతున్న మిషన్ భగీరథ నీరు

బస్‌షెల్టర్ లేక తిప్పలు



మహమ్మద్‌నగర్‌లో రోడ్డుపై నిల్చున్న ప్రయాణికులు

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాన్సువాడ– ఎల్లారెడ్డి ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఇటీవల బస్ షెల్టర్‌ను కూల్చి వేశారు. రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగుతుండటంతో బస్‌షెల్టర్ నిర్మాణం చేపట్టలేదు. దీంతో ప్రయాణికులు బస్సుల కోసం రోడ్డుపైనే వేచిఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైన సంబంధి అధికారులు స్పందించి బస్టాండ్ ప్రాంతంలో బస్ షెల్టర్‌ను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

పనిచేసేవారికే ప్రజలు పట్టం కట్టాలి



మద్నూర్‌లో లబ్ధిదారులకు రేషన్‌కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, సబ్ కలెక్టర్ కిరణ్మయి

- జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు
- మద్నూర్‌లో రేషన్‌కార్డులు, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మద్నూర్(జుక్కల్): కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేసే ప్రభుత్వమని, ప్రజలు పనిచేసే వారికే పట్టం కట్టాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. మండల కేంద్రంలోని గురు ఫంక్షన్ హాల్‌లో సోమవారం నూతన రేషన్‌కార్డులు, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయితో కలిసి లబ్ధిదారులకు రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డిని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు మద్దతు పలికి బలపర్చాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ఇప్పించే బాధ్యత తనదేనని తెలిపారు. జిల్లాలో మొట్టమొదటి ఇందిరమ్మ ఇళ్లు జుక్కల్ నియోజకవర్గంలో పూర్తయి, గృహప్రవేశం జరిగిందన్నారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. బాలికలకు 18 ఏళ్లు నిండిన వెంటనే లేదా లోపే పెళ్లిళ్లు చేస్తే చాలా ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. తహసీల్దార్ ముజీబ్, నాయకులు సాయిలు, పరమేశ్‌పటేల్, హన్మండ్లు స్వామి, శీనుపటేల్, రాములు, హన్మంత్‌యాదవ్, హన్మంత్‌రావ్ దేశాయ్, గంగాధర్ ఉన్నారు.



రాజుల్లా గ్రామంలో..

బిచ్కుంద మండలంలో..

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని రాజుల్లా గ్రామంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, సబ్ కలెక్టర్ కిరణ్మయి లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. తహసీల్దార్ వేణుగోపాల్, నాయకులు భీమ్‌రెడ్డి, కవిత, నాయకులు గంగాధర్ ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గ బంజారా సేవా సంఘం నాయకులు సోమవారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావును కలిశారు. జుక్కల్ నియోజకవర్గ బంజార సేవా సంఘం నూతన కార్యవర్గం ఎన్నికవడంతో వారిని ఎమ్మెల్యే సన్మానించారు. నాయకులు గోపిసింగ్, లోక్యానాయక్ తదితరులు ఉన్నారు.

భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించండి

మద్నూర్(జుక్కల్): మద్నూర్–బోధన్ జాతీయ రహదారి కోసం భూములు కోల్పోతున్న తమకు నష్టపరిహారం ఇవ్వాలని బాధిత రైతులు కోరారు. ఈమేరకు వారు సోమవారం మండల కేంద్రానికి వచ్చిన బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయిని కలిసి వినతిపత్రం అందజేశారు. మద్నూర్, డోంగ్లీ రెండు మండలాల్లోని 9 గ్రామాలకు చెందిన 142 ఎకరాల భూమిని జాతీయ రహదారిలో కోల్పోతున్నామని వారు తెలిపారు. బాధిత రైతులకు మంచి నష్టపరిహారం అందించాలని కోరారు. మద్నూర్, తడిహిప్పర్గా, సోనాల, లింబూర్ తదితర గ్రామాలకు చెందిన రైతులు తదితరులు ఉన్నారు.



మద్నూర్‌లో సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పీహెచ్‌సీ తనిఖీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని ఎర్రాపహాడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం డిప్యూటి డీఎంహెచ్‌వో ప్రభుకిరణ్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది సమయ పాలన పాటిస్తూ విధులను నిర్వహించాలని సూచించారు. అన్నిరకాల మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండల వైద్యాధికారి ఖాసీం, హెచ్‌ఈవో నారాయణ, సూపర్‌వైజర్లు తదితరులు ఉన్నారు.



రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి



పొల్కంపేటలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఈవో



తాడ్వాయి మండలం కృష్ణాజీవాడిలో..

లింగంపేట/దోమకొండ/ఎల్లారెడ్డి/తాడ్వాయి: కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు, అలాగే బీమా లేని రైతులు ఈనెల 13లోగా రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. ఈమేరకు సోమవారం పలు మండలాల్లో రైతుల నుంచి వారు దరఖాస్తులను స్వీకరించారు. 2024 ఆగస్టు 14 నుంచి 2025 జూన్ 5లోపు కొత్తగా పట్టా పాస్ బుక్‌లు పొందిన రైతులు బీమా పథకానికి అర్హులన్నారు. 59 ఏళ్లలోపు వయస్సు ఉన్న రైతులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఆసక్తిగల రైతులు సంబంధిత పత్రాలతో స్థానిక రైతు వేదికల్లో దరఖాస్తులను అందించాలన్నారు. ఏవోలు అనిల్‌కుమార్, మణిదీపిక, నర్సింలు ఉన్నారు.

సమాచారం..

నేడు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి విద్యుత్‌శాఖ సబ్ డివిజన్ పరిధిలో నేడు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు టీజీఎన్‌పీడీసీఎల్ సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని విద్యుత్ సెక్షన్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఏవైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయవచ్చన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండల కేంద్రంలోని సొసైటీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు చేతుల మీదుగా లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేయనున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మహమ్మద్‌నగర్, నిజాంసాగర్ మండలాల లబ్ధిదారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమానికి తరలి వచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు.

సంక్షిప్తం

దాబా హోటళ్లపై దాడులు

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్, నిజాంసాగర్ మండలాల్లోని మూడు దాబా హోటళ్లపై సోమవారం రాత్రి పోలీసులు దాడు లు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా దాబా హోటళ్లలో మద్యం సిట్టింగ్‌లు నిర్వహి స్తుండటంతో నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు.

సోమారంపేట వాసికి గజల్ కవి పురస్కారం



మాచారెడ్డి: మండలంలోని సోమారంపేట గ్రామానికి చెందిన యువ కవి కల్లెం నవీన్‌రెడ్డి 'గజల్ కవి' పురస్కారం అందుకున్నారు. ఇటీవల జరిగిన తెలుగు గజల్ గాన విభావరి కార్యక్రమంలో నవీన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ భాష సంస్కృతిక శాఖ అధ్యక్షుడు హరికృష్ణ ఆయనకు పురస్కారాన్ని అందజేశారు.

బడిలో గుంతల పూడ్చివేత



కామారెడ్డి అర్బన్: దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణం ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలు తేలడంతోపాటు బురదమయంగా మారింది. దీంతో బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు చినోళ్ల రజనీకాంత్‌రావు సోమవారం బడి ప్రాంగణాన్ని మొరంతో చదును చేయించాడు. అలాగే రోడ్డుపై నిలిచిపోయిన మురికినీటిని తొలగింపజేశారు.

స్టీల్ రెయిలింగ్ ఏర్పాటు

భిక్కనూరు: మండల కేంద్రంలోని సిద్ధరామేశ్వరాలయానికి చెందిన అన్నప్రసాద పంపిణీ భవనానికి క్యూలైన్ కోసం స్టీల్ రెయిలింగ్‌ను సోమవారం కాచాపూర్ గ్రామానికి చెందిన డాక్టర్ పుండరికం–సుశీల, వారి కుమారుడు శ్రవణ్‌కుమార్ ఏర్పాటు చేయించారు. వీరిని ఆలయ ఈవో శ్రీధర్, పూజారి రాజేశ్వరశర్మ సన్మానించారు.

సీనియర్ సిటిజన్స్ ఆటలపోటీలు

కామారెడ్డి అర్బన్: పట్టణంలో సోమవారం సీనియర్ సిటిజన్స్‌కు క్యారం, షటిల్ డబుల్స్, సింగిల్స్, చదరంగం,యోగాసనాలు,నడక పోటీలతోపాటు పాటల పోటీలు నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సీనియర్ సిటిజన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు పున్న రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి రాజన్న, ప్రతినిధులు జైహింద్‌గౌడ్, మోహన్ రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుభాష్‌రెడ్డి జన్మదిన వేడుకలు



భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో విద్యాదాత తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి,సంబురాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డుకు మరమ్మతులు



భిక్కనూరు: మండల కేంద్రంలోని సిద్దిరామేశ్వర ఆలయానికి వెళ్లే సర్వీస్ రోడ్డు గుంతలు తేలి అధ్వానంగా మారింది. సమస్యను అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో పట్టణానికి చెందిన కౌసల్య ఫౌండేషన్ చైర్మన్ జ్ఞాన ప్రకాశ్‌రెడ్డి తన సొంత డబ్బులు రూ. 1.70 లక్షలు వెచ్చించి రోడ్డుపై మొరం పోయించి రోలింగ్ చేయించారు. ఈసందర్భంగా జ్ఞానప్రకాశ్‌రెడ్డి సేవలను ప్రజలు అభినందించారు.

కార్యకర్తలకు అండగా కాంగ్రెస్ పార్టీ

బాన్సువాడ: కాంగ్రెస్ పార్టీ ప్రతీ కార్యకర్త కు అండగా ఉంటుందని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏను గు రవీందర్‌రె డ్డి అన్నారు. చించోల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు బసలింగం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా, సోమవారం ఆయనను పరామర్శించారు. అనంతరం కిష్టాపూర్ గ్రామంలో సీనియర్ నాయకులు దండు పెద్ద సా యిలు కుమార్తె ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నాయకులు కొత్తకొండ భాస్కర్, కమలాకర్‌రెడ్డి, ప్రతాప్‌సింగ్, నందురెడ్డి, పాతబాలకృష్ణ, మంత్రి గణేష్, అక్బర్, యునుస్, బాడి శ్రీనివాస్, లయక్ ఉన్నారు.

మొక్కలు నాటించిన అధికారులు



సాక్షి ఎఫెక్ట్..

నిజాంసాగర్(జుక్కల్): మొక్కల పెంపకంపై 'వన మహోత్సవం లక్ష్యం నెరవేరేనా..!' అనే కథనం సాక్షిలో ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. మండలంలోని నర్సింగ్‌రావ్‌పల్లి గ్రామ వన నర్సరీని సోమవారం ఈజీఎస్ ఏపీవో శివకుమార్ సందర్శించారు. నర్సింగ్‌రావ్‌పల్లి గ్రామ నర్సరీలో మొక్కలు లేకుండా కవర్లు ఉండటంపై విచారణ చేపట్టారు. నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కలను వనమహోత్సవం కింద గుంతలు తవ్వించి నాటించారు. ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ అంజయ్య తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సోమవారం లంబాడా హక్కుల పోరాట సమితి బాన్సువాడ డివిజన్ అధ్యక్షుడు సుభాష్ జాదవ్ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. సమావేశంలో పిట్లం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజు రాథోడ్, ప్రధాన కార్యదర్శిగా అశోక్, ఉపాధ్యక్షుడిగా ప్రవీణ్, సంయుక్త కార్యదర్శిగా అనిల్, గౌరవ అధ్యక్షుడిగా తుకారాం, ఆర్గనైజేషన్ సెక్రటరీగా మాణిక్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీని సమితి ప్రతినిధులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆధ్యాత్మికం

శివ భక్తుల పాదయాత్ర



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని బ్రహ్మాజీవాడి గ్రామానికి చెందిన భక్తులు సోమవారం గాంధారి మండలంలోని గుడిమెట్ వద్ద ఉన్న మహదేవుడి ఆలయానికి పాదయాత్రగా వెళ్లారు. ఈసందర్భంగా వారు భగవన్నామ సంకీర్తనలు, పాటలు పాడుకుంటూ పాదయాత్ర కొనసాగించారు. ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకొని, పూజలు నిర్వహించారు.

సిద్ధరామేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



భిక్కనూరు: మండల కేంద్రంలోని సిద్ధరామేశ్వరాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పలువురు భక్తులు తమ కుటుంబీకులతో కలిసి సామూహిక అభిషేకాలను, సత్యనారాయణ స్వామి వ్రతాలను, కుంకుమ పూజలను నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.

రామేశ్వర ఆలయంలో..

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని పురాతన శివాలయం రామేశ్వర ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్న ప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.



ఘనంగా గాజుల పేరంటం



బీబీపేట: బీబీపేట ఆర్యవైశ్య సంఘ సభ్యులు మంగళవారం మెదక్ జిల్లా చౌదర్పల్లిలోని దుబ్బరాయేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు 'గాజుల పేరంటం' ఘనంగా నిర్వహించారు.అలాగే అన్నప్రసాద వితరణ చేపట్టారు.సంఘప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

16, 17 తేదీల్లో ఇస్కాన్‌లో వేడుకలు

కామారెడ్డి అర్బన్: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో ఈనెల 16న శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఉదయం 5గంటల నుంచి రాత్రి 12గంటల వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఇస్కాన్ కామారెడ్డి కేంద్రం ప్రతినిధి వెంకటదాస్ ప్రభు ఒక ప్రకటనలో తెలిపారు. నగర సంకీర్తన, సాంస్కృతిక కార్యక్రమాలు, కలశాభిషేకం, జూలన్‌సేవ, శ్రీకృష్ణ లీలామృత శ్రవణం, మహా హారతి, చప్పన్ భోగ్, ప్రసాద వితరణ ఉంటుందన్నారు. 17న ఉదయం 10 గంటల నుంచి నందనోత్సవం, శ్రీల ప్రభుపాద వ్యాస పూజ, విశేష అన్నప్రసాదం కార్యక్రమాలుంటాయన్నారు.